
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్టం : 22.0 | కనిష్టం : 25.0

ANDHRAJYOTHY 5



గులాబీలు



రంజిత్‌కుమార్, బాసు హనుమంతునాయుడు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, డాక్టర్ కురువ విజయ్‌కుమార్

- కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరికతో బీఆర్ఎస్ గద్వాల నాయకత్వం కోసం పోటీ
- ఎన్‌పీహెచ్ఎస్ చైర్మన్ రంజిత్‌కుమార్ గులాబీ నాయకులతో సమావేశం
- హన్మంతునాయుడు, కురువ విజయ్‌కుమార్‌తోపాటు మరికొందరు ఆశావహులు
- సామాజికవర్గం, స్థానిక బలం ఉన్న వారికి బాధ్యతలు ఇచ్చే అవకాశం
- ఇప్పటికే కార్యకర్తలతో నాయకుల భేటీ..

మహబూబ్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నడిగడ్డ బీఆర్ఎస్‌లో నాయకత్వ అనిశ్చితి నెలకొంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలో హస్తం గాలి వీచి.. 14 స్థానాలకు, 12 స్థానాలను కాంగ్రెస్ అభ్యర్థులు కైవసం చేసుకోగా.. నడిగడ్డ ప్రాంతంలోని రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి అక్కడి ప్రజలు విలక్షణ తీర్పును ఇచ్చారు. విజయం సాధించిన కొద్ది నెలల్లోనే గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరగా.. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కూడా త్వరలో కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చల్లా వెంకట్రామిరెడ్డి సమావేశమై చర్చించగా.. ఆషాఢం తర్వాత హస్తం కండువా కప్పుకునే అవకాశం ఉంది. అదే జరిగితే నడిగడ్డలో గులాబీ పార్టీలో నాయకత్వ శూన్యత ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇక్కడ పార్టీ నాయకత్వం పునరుద్ధరణపై దృష్టి సారించారు. త్వరలో రెండు నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి, నాయకత్వాన్ని ఖరారు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం గద్వాల నియోజకవర్గంలో గులాబీ పార్టీ నాయకత్వం కోసం పలువురు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పార్టీ స్థానికంగా బలంగా ఉండటంతోపాటు.. సామాజికంగా రెండు నియోజకవర్గాల్లో బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని నిలబెట్టే సమర్థత ఉన్న నాయకులవైపు అధినాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్, బాసు హన్మంతునాయుడు, కురువ విజయ్‌కుమార్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు తదితరులు ముఖ్య నాయకులతో భేటీ అవుతున్నారు. అలాగే తమ వర్గం కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో అనిశ్చితి నెలకొన్నప్పుడు నాయకత్వ బాధ్యతలు తీసుకోవడం ద్వారా వచ్చే ఎన్నికల్లో ప్రధాన పోటీదారుగా ఉండొచ్చనే భావన వారిలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ మాత్రం బలమైన నాయకులకు అవకాశం ఇవ్వాలని.. అసెంబ్లీ ఎన్నికల్లో అంతటి హవాలోనూ గెలిపించిన కేడర్‌ను కాపాడుకోవాలనే ఆలోచనలో ఉంది.

ఎవరి బలమెంత?

ప్రస్తుతం పోటీలో ప్రధానంగా నలుగురు నాయకులు కనిపిస్తున్నారు. వారిలో ఒకరైన నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్‌కు 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం ఉంది. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కంటే ఎక్కువ ఓట్లను రంజిత్ తెచ్చుకున్నారు. కేవలం ప్రధాన పార్టీ వేదిక తనకు దొరక్కపోవడం వల్లనే ఇబ్బంది అవుతుందనే ప్రచారం ఉంది. గత ఎన్నికల్లో ఒకే సామాజికవర్గం నుంచి పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు ఉండటంతో అతనికి కొంత ఓట్లు తక్కువగా వచ్చాయి. నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చాలా ఏళ్లుగా విస్తృత కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రతీ గ్రామంలో సొంత కేడర్ ఉంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు తన వర్గం అభ్యర్థులు పోటీ కూడా ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చినా.. ఆయన బీజేపీ అభ్యర్థికి మద్దతివ్వడం వల్ల గద్వాలలో బీజేపీకి మెజారిటీ వచ్చింది. గద్వాలతోపాటు అలంపూర్ నియోజకవర్గాల్లో కురువ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉండటం కూడా ఆయన నాయకత్వానికి కలిసి వస్తుంది. కొందరు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కేటీఆర్‌తో సమావేశమై.. బాధ్యతలు అప్పగించాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో చర్చించినట్లు సమాచారం. స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు గౌడ్ కూడా నాయకత్వ పోటీలో ఉంటారని భావించినప్పటికీ.. ఆయన క్రియాశీలక పాత్రకు మాత్రమే పరిమితమని, ఇన్‌చార్జి రేసులో లేనని స్పష్టం చేశారు. బాసు హన్మంతునాయుడు మెజారిటీ బోయ సామాజిక వర్గం తరఫున ప్రతినిధిగా ఉన్నారు. తనకూ సొంత కేడర్ ఉంది. బీఆర్ఎస్‌లో సీనియర్ లీడర్‌గా పేరుంది. అయితే ఆయన గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో ఉండి.. కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడాన్ని కొందరు వ్యతిరేకించారు. నాయకత్వాన్ని ఆశిస్తున్న మరొకరు డాక్టర్ కురువ విజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో సుదీర్ఘ కాలం పని చేశారు. ఉద్యమకారుడిగా పేరుంది. గత ఎన్నికల సమయంలో సరితకు టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ పార్టీకి రాజీనామా చేశారు. రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఇంకొకరు నాగర్‌దొడ్డి వెంకట్రాములు ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే బీఆర్ఎస్ వ్యవస్థాపక సమయం నుంచి ఉన్నారు. 2004లో టీఆర్ఎస్ తరఫున పోటీచేసి 9501 ఓట్లు సాధించారు. అంతకుముందు 1999లో కూడా ఎంసీపీఐ(ఎస్) నుంచి పోటీ చేసి 5,424 ఓట్లు సాధించారు.



అబ్రహాం మళ్లీ వెనక్కి..

అలంపూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే అబ్రహాం మళ్లీ బీఆర్ఎస్ గూటికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు కాంగ్రెస్‌లో చేరితేనే ఇది సాధ్యం కానుంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో అలంపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న అబ్రహాంను కాదని, చల్లా సూచించిన విజయుడికి బీఆర్ఎస్ టికెట్ ఇచ్చింది. దాంతో అబ్రహాం బీఆర్ఎస్ అధిష్ఠానాన్ని వ్యతిరేకించి.. కాంగ్రెస్‌లో చేరారు. పేరుకు కాంగ్రెస్‌లో చేరినా, సంపత్‌కుమార్ అబ్రహాంను, ఆయన వర్గాన్ని పెద్దగా పట్టించుకోలేదని ప్రచారం ఉంది. ఇప్పుడు కూడా తన వర్గం నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని అబ్రహాం భావిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనే మాజీ మంత్రి హరీశ్‌రావు నుంచి పిలుపు కూడా వచ్చినట్లు చర్చ జరిగింది. అయితే చల్లా బీఆర్ఎస్‌లో ఉండటంతో వారు వెనుకడుగు వేశారని సమాచారం. తాజాగా చల్లా పార్టీ మారతారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అబ్రహాం బీఆర్ఎస్‌వైపు మొగ్గుచూపుతారని తెలుస్తోంది. ఈ రెండు నియోజకవర్గాల్లో బోయ, కురువ సామాజిక వర్గాలు బలమైనవిగా చెప్పొచ్చు. ఈ రెండు సామాజిక వర్గాల నుంచే నూతన నాయకత్వాన్ని ఎంపిక చేస్తారని సమాచారం. ఎక్కువగా గొంగళ్ల రంజిత్‌కుమార్‌వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుండగా.. బాసు హన్మంతు నాయుడుకు కూడా పార్టీలో మంచి పట్టు ఉంది. డాక్టర్ కురువ విజయ్‌కుమార్‌కు ఆశలు ఉన్నప్పటికీ.. తను నియోజకవర్గంలో ఉండకపోవడం కొంత మైనస్‌గా మారే పరిస్థితి ఉంది. ప్రధానంగా రంజిత్, హన్మంతు నాయుడిపైనే ఫోకస్ ఉంది.

పాలమూరుకు.. జ్వరం

- రెండు నెలల్లో అతిసార బాధితులు 2,111 మంది.. జ్వర పీడితులు 3,631 మంది..
- చిన్నపిల్లలే అధికం
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జూలై 20: మహబూబ్‌నగర్ జిల్లాకు జ్వరం మొచ్చింది. కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాతావరణంలో మార్పులు రావడంతో పాటు పారిశుధ్యం లోపించి ప్రజలు అతిసార, జ్వరాల బారిన పడుతున్నారు. ఈ రెండు నెలల కాలంలోనే బాధితుల సంఖ్య విపరీతంగా పెరిగింది. అతిసార బాధితులు 2,111 మంది ఉండగా.. జ్వర పీడితులు 3,631 మంది ఉన్నారు. పిల్లలే ఎక్కువగా వ్యాధుల బారిన పడుతున్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి, ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వాల్సిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కాలయాపన చేస్తోంది.

వాతావరణంలో మార్పులతో..

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలు తెగిపోవడం, పైపులైన్ల లీకేజీల వల్ల తాగు నీరు కలుషితమవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దాంతో ప్రజలు అతిసార, జ్వరాలకు గురవుతున్నారు. గత రెండు నెలల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లలో అతిసార బాధితులు 1,718 మంది ఉండగా.. జ్వర పీడితులు 2,391 మంది ఉన్నారు. దాంతో పాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అతిసార కేసులు 393 నమోదవగా.. జ్వరాల కేసులు 1,240 నమోదయ్యాయి. రెండు కలిపితే అతిసార కేసులు 2,111 ఉండగా.. జ్వరాల కేసులు 3,631 ఉన్నాయి. వారిలో చిన్న పిల్లలే ఎక్కువగా ఉంటున్నారు. ఈ రెండు నెలల్లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి జనరల్ వార్డుల్లో 125 మంది పెద్దలు చికిత్స పొందగా, చిన్నపిల్లల విభాగంలో 73 మంది అతిసార, 788 మంది జ్వరాల బాధితులు నమోదయ్యారు. 93 మంది అడ్మిట్ అయ్యి చికిత్స చేయించుకున్నారు.



వర్షాకాలానికి నెల రోజుల ముందే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలను సమన్వయం చేస్తూ ప్రణాళికలు రూపొందించాలి. కానీ ఇప్పటి వరకు వైద్య, ఆరోగ్య శాఖ ఎలాంటి ప్రణాళికలు తయారు చేయలేదు. కలెక్టర్ విజయేందిర బోయి

కలెక్టర్ ఆదేశించినా..

సంబంధిత శాఖల అధికారులతో ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి, కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. కానీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. శాఖలోని ఎపిడమిక్ సెల్, మాస్ మీడియా విభాగం అధికారులు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి, ప్రజల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి. డ్రైనేజీలు, నీళ్ల పైపులు లీకేజీలు లేకుండా చూడాలి. తాగునీటి సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత చర్యలు చేపట్టాలి. అప్పుడే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయి.

ఇలా చేస్తే అతిసారను తరిమేయొచ్చు..

అతిసార వ్యాప్తి చెందకుండా ఉండాలంటే గ్రామీణ ప్రాంతాలపై దృష్టి పెట్టాలి. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ, ఆరోగ్యశాఖలు సమన్వయంతో పని చేయాలి.

- గ్రామాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులు, వాటర్ ట్యాంకులు, మినీ వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించాలి.
- డ్రైనేజీలు, ఇతర మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి.
- మంచినీటిని సరఫరా చేసే పైప్‌లైన్లు లీకేజీలు ఉన్నాయేమో చూసుకోవాలి. ఉంటే వాటిని మరమ్మతులు చేయించాలి. ట్యాంకుల వద్ద ఉన్న మెయిన్ వాల్వులలో చెత్త, చెదారం చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు లేకుండా చూడాలి. అందులోనే డ్రైనేజీ, వర్షం నీళ్లు నిలిచి ఈగలు, దోమలు ఎక్కువై మలేరియా, డెంగీ, అతిసారకు కారణమవుతాయి.
- నల్లా గుంతలు, నీటి తొట్టీలు, చిన్న హౌజులలో నీరు నిల్వ ఉంచకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి.

కలుషిత నీరు, ఆహారంతోనే..

ప్రధానంగా కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తినడం వలన అతిసార సోకుతుంది. వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల అందులో ఈగలు, దోమల లార్వా వలన నీరు కలుషితం అవుతుంది. దీంతో ఎలిమెంథిస్ అనే క్రిములు తీవ్రంగా వ్యాప్తి చెందుతాయి. ఆ క్రిములు ఆహార పదార్థాలు, తాగునీటిపై వాలుతూ వ్యాధులకు గురిచేస్తాయి. ఈ వర్షాకాలంలో అతిసారతో పాటు కలరా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ వ్యాధులు కూడా వస్తాయి. వృద్ధులు, పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపుతాయి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. తాజా కూరగాయలతోనే వంటలు చేసుకోవాలి. బయట దొరికే తినుబండారాలు, పదార్థాలు తినకపోవడం చాలా మంచిది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. స్వచ్ఛమైన నీటిని తాగడం ద్వారానే అతిసార బారిన పడకుండా మనల్ని కాపాడుకోవచ్చు.

జూరాల 17 గేట్లు ఎత్తివేత



జూరాల ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

ధరూరు, జూలై 20: ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జూరాల ప్రాజెక్టు 17 గేట్లను మీటరు ఎత్తు ఎత్తారు. ప్రాజెక్టుకు 90,800 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో.. 1,04,416 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. దీంతో నదీపరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి 34,733 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ఐదు యూనిట్ల ద్వారా 154 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. నెట్టెంపాడు లిఫ్ట్-1కు 1,500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 1,300, ఎడమ కాల్వకు 870, కుడి కాలువకు 457, సమాంతర కాలువకు 300, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు.



తాడూరు ఎమ్మార్వో కార్యాలయ సమీపంలో వర్షానికి కూలిన చెట్టు.. రాకపోకలకు ఇబ్బంది

ఎడతెరిపి లేని ముసురు

- కోస్గి మండలంలో 58.6 మి.మీ. వర్షపాతం నమోదు



చారకొండ మండలంలో కూలిన ఇల్లు

మహబూబ్‌నగర్/వనపర్తి అర్బన్/గద్వాల/నారాయణపేట/నాగర్‌కర్నూల్, జూలై 20 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో 24 గంటల పాటు ఎడతెరిపి లేకుండా ముసురు వాన కురుస్తోంది. విడవకుండా వాన కురుస్తుండటంతో జనం చలికి ముసుగేస్తున్నారు. జనజీవనం ఎక్కడికక్కడా స్తంభించిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం మొదలైన వాన శనివారం రోజంతా ఆగకుండా తేలికపాటి నుంచి మోస్తరు వాన కురుస్తూనే ఉన్నది. ముసురు వానలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మట్టి ఇళ్లు కూలిపోయాయి.

- నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. కోస్గి మండలంలో 58.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ధన్వాడ మండలంలో 36.4, ఊట్కూర్‌లో 27.4, నారాయణపేట మండలంలో 26.2, మద్దూర్ మండలంలో 26.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.
- వనపర్తి జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, చెరువులలో వరద నీరు చేరుతోంది. వనపర్తిలో 49.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గోపాల్‌పేట 37.2, పెద్దమందడి 36.5, రేవల్లి 35.3, కొత్తకోట 26.5, ఘణపూర్ 23.6, పాన్‌గల్ 23.2, అమరచింత 23.0, పెబ్బేరు 22.1, ఆత్మకూరు 22.0, చిన్నంబావి 21.6, మదనాపూర్ 20.4, వీపనగండ్ల 20.0, శ్రీరంగాపూర్ 16.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.
- మహబూబ్‌నగర్ జిల్లా అంతటా సగటున 25 మి.మీ. వర్షపాతం నమోదైంది. రుణమాఫీతో ఓ వైపు రైతులు సంబురాలు చేసుకుంటుండగా మరో వైపు కురుస్తున్న వానలకు అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుండటంతో వరి సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. మహ్మదాబాద్ మండలంలో 49 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గండీడ్‌లో 41, కోయిలకొండలో 29.9, అడ్డాకులలో 29.8, బాలానగర్‌లో 28.2, సీసీకుంటలో 27.3, మూసాపేటలో 25.9, హన్వాడలో 22.6, మహబూబ్‌నగర్ రూరల్‌లో 21.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.
- జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 32.5 మిల్లీ మీటర్లు, రాజోలిలో 31, ఉండవెల్లిలో 27.5, అలంపూర్‌లో 25.3, ఇటిక్యాలలో 24, అయిజలో 23.8 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. గద్వాలలో 19, గట్టులో 18.5, కేటీదొడ్డిలో 16.8, ఇటిక్యాల, మల్దకల్ లలో 14.5, ధరూర్‌లో 13.3, మానవపాడులో 12.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.
- నాగర్‌కర్నూలు జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో కూడా ముసురు వర్షం కురిసింది. తిమ్మాజిపేటలో 20.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. బిజినేపల్లిలో 13.4, నాగర్‌కర్నూల్‌లో 15, తాడూరులో 14, ఊర్కొండలో 18, వెల్దండలో 4.8, చారకొండలో 4.8, వంగూరులో 12.6, కల్వకుర్తిలో 16.2, తెలకపల్లిలో 11.2, ఉప్పునుంతలలో 8.2, అచ్చంపేటలో 10.6, అమ్రాబాద్‌లో 5.4, పదరలో 5.6, బల్మూరులో 7.2, లింగాలలో 21.6, పెద్దకొత్తపల్లిలో అత్యధికంగా 30.2, కోడేరులో 16.2, కొల్లాపూర్‌లో 30, పెంట్లవెల్లిలో 23.2 మిల్లీ మీటర్ల వర్షం పడింది.

కూలిన తొమ్మిది ఇళ్లు

జడ్చర్ల/కొత్తకోట/పెద్దమందడి/తాడూరు/ఆత్మకూరు/చారకొండ: ముసురు వర్షాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మట్టి ఇళ్లు కూలిపోయాయి. జడ్చర్ల మునిసిపాలిటీలోని సంజీవయ్య నగర్‌కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి మంజుల ఇంటి గోడ కూలింది. మునిసిపల్ కమిషనర్ రాజయ్య పరిశీలించారు. కొత్తకోట పట్టణంలోని ముస్లిం వీధికి చెందిన బీడీ కార్మికురాలు రజియా బేగం మట్టి ఇల్లు శనివారం ఉదయం కూలిపోయింది. ఆ సమయంలో అందరూ బయట ఉండటంతో ప్రమాదం తప్పింది. పెద్దమందడి మండల కేంద్రంలో చాకలి సింగారం చిన్న బాలస్వామి, మండలంలోని పిల్లికుంట తండాలో కేత్లావత్ రాకేష్, వీరాయిపల్లిలో మెకానిక్ చెన్నయ్య ఇళ్లు కూలిపోగా, వాటిని ఆర్ఐ తిరుపతయ్య పరిశీలించారు. ఆత్మకూరు మండలంలోని మోట్లంపల్లిలో బాల్‌రాజు పెంకుటిల్లు, చారకొండ మండల కేంద్రంలో మారుపాకుల సుగుణమ్మ, చింతపల్లి లక్ష్మమ్మ, మొగిళ్ల సరోజన మట్టిమిద్దెలు కూలిపోయాయి. తాడూరు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చెట్టు కూలి రోడ్డుపై అడ్డంగా పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి, చెట్టును తొలగింపజేశారు.



వానకు వనపర్తిలో జన సంచడి తగ్గిన ప్రధాన రహదారి

కేఎల్ఐ ఆయకట్టు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- మరో రెండు రోజులు ఇన్‌ఫ్లో కొనసాగే అవకాశం

నాగర్‌కర్నూల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతం నుంచి వస్తున్న వరద జలాలతో మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. వర్షాకాలం సీజన్ ప్రారంభమై 50రోజులు గడుస్తున్నా సరైన వర్షాలు లేక ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొన్న విషయం తెలిసిందే. మహాత్మాగాంధీ కేఎల్ఐ లిఫ్టు ఇరిగేషన్ పథకం ద్వారా ఎల్లూరు, సింగవట్నం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్ల నుంచి చెరువులు, కుంటలను నింపి దాదాపు మూడు లక్షల 7వేల ఎకరాలకు సాగునీరందిస్తున్నారు. వాస్తవానికి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా 4లక్షల 55వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉండగా అందుకు తగినట్లుగా రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రధానంగా ఉన్న కేసరి సముద్రం, శంకర సముద్రం, భీమా సముద్రం, పాలెం పెంటమోని చెరువు ద్వారా చెరువులు, కుంటలను నింపి సాగునీరందిస్తున్నారు.

ఎగువ నుంచి వచ్చే వరదపైనే ఆశలు

సాధారణంగా జూన్ మాసం ముగిసే నాటికి శ్రీశైలం జలాశయానికి సమృద్ధిగా నీరు చేరడం వరద జలాల ఆధారంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మూడు పంపుల ద్వారా ఎల్లూరు, సింగవట్నం, జొన్నలబొగుడ , గుడిపల్లిగట్టుల్లో నీటి పంపింగ్ ప్రక్రియ జరిగేది. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నాలుగు నియోజకవర్గాల్లో దాదాపు నాలుగు టీఎంసీలలో నీటిని మాత్రమే నిల్వ చేసుకోగలిగే రిజర్వాయర్లు మాత్రమే ఉండడం కారణంగా చివరి ఆయకట్టు వరకు సాగునీరందించే పరిస్థితి లేకుండాపోయింది. చెరువులు, కుంటల ద్వారా దాదాపు 3లక్షల 7వేల ఎకరాలకు ఇరిగేషన్ అధికారులు నీటి సౌలభ్యం కల్పిస్తున్నారు. అయితే ఈ సీజన్‌లో కృష్ణా పరివాహక ప్రాంతంతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని ఎగువ ప్రాంతంలో కూడా వర్షాలు రాకపోవడంతో శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో గణనీయంగా తగ్గిపోయింది. దీని కారణంగా నాట్లు కూడా వేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. వరి నాట్లు కూడా ముదిరిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

పాఠశాల క్రీడలకు సన్నాహాలు

- షెడ్యూల్ విడుదల చేసిన ఎస్‌జీఎఫ్
- ఆగస్టు, సెప్టెంబరులో జట్ల ఎంపికలు
- పాఠశాల, కళాశాల స్థాయిలో పోటీలు


ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 20 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల నిర్వహణకు ముందడుగుపడింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి పోటీలను నిర్వహించనున్న తేదీలను ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడ పోటీల నిర్వహణ ఆగస్టు మొదటి వారంలో ప్రారంభం కానుంది. డీఈవోల ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, వ్యాయమ ఉపాధ్యాయులతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. పాఠశాల, కళాశాలస్థాయిలో అండర్-14, 17,19 విభాగాల్లో బాల,బాలికలకు వేర్వేరుగా మండల, జిల్లా, ఉమ్మడి జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేయనున్నారు. పాఠశాల క్రీడల షెడ్యూల్ విడుదల కావటంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది.

ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడ పోటీల ని ర్వహణ ఆగస్టు మొదటి వారంలో ప్రారంభం కానుంది. మండల స్థాయి పోటీలను ఆగస్టు మొదటి, రెండో వారంలో, జిల్లాస్థాయి పోటీలు ఆగస్టు మూడో వారంలో, ఉమ్మడి జిల్లా ఎంపికలు సెప్టెంబరు రెండో వారంలో పోటీలు నిర్వహించనున్నారు. సెప్టెంబరు నాలుగో వారం లో తెలంగాణ పాత పది జిల్లాల జట్లతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేస్తారు. ఉమ్మడి జిల్లా నుంచి ఒక జట్టు పాల్గొంటే అందులో 12 మంది ఉంటారు. ఒక్కో జిల్లా నుంచి ఇ ద్దరు లేక ముగ్గురికి చోటు దక్కుతుంది. స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశలు దక్కుతాయి. ఎస్‌జీఎఫ్ పోటీలకు క్రీడాకారులు సిద్ధమవుతున్నారు. క్రీడలను పారదర్శకంగా నిర్వహించేందుకు అయా జిల్లాల్లో డీఈవోలతో పాటు ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

గతేడాది జాతీయస్థాయి పోటీలకు 90మంది క్రీడాకారులు

2023-24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 11 రాష్ట్రస్థాయి టోర్నీలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు టోర్నీలు, వనపర్తి- మూడు, జోగుళాంబ గద్వాల- రెండు, నాగర్‌కర్నూల్-ఒకటి, నారాయణపేట జిల్లాలో ఒక టోర్నీ నిర్వహించారు. సుమారు 90మంది బాల, బాలికలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. వారికి భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో క్రీడకోటా దక్కనుంది.

పకడ్బందీగా నిర్వహిస్తాం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల నిర్వహణ పారదర్శకంగా నిర్వహిస్తాం. పోటీలను నిర్వహించనున్న తేదీలను ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నుంచి జిల్లాలకు ఆదేశాలు అందాయి. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, వ్యాయమ ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. ఆగస్టు, సెప్టెంబరులో మండల, జిల్లా, ఉమ్మడి జిల్లా పోటీల నిర్వహణ, ఎంపికలు పూర్తి చేస్తాం.

- రవీందర్, డీఈవో, ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

నేరాల కట్టడికి ఆటోలకు ట్రాఫిక్ నెంబర్లు

- ఈనెల 21నుంచి 25 వరకు నెంబర్లు ఇవ్వనున్న ట్రాఫిక్ పోలీసులు

మహబూబ్‌నగర్, జూలై 20 : ఆటోలకు గతంలో ట్రాఫిక్ నెంబర్‌లు ఇచ్చిన తరహాలో మళ్లీ నెంబర్లు ఇవ్వాలని పోలీస్‌శాఖ నిర్ణయించింది. ఆటోల కారణంగా జరిగే దొంగతనాలు, ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు ట్రాఫిక్ నెంబర్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇటీవల వృద్ధులను ఆటోలలో ఎక్కించుకుని నిర్మానుష్యంగా ప్రాంతాలకు తీసుకెళ్లి వారి వద్ద నగలు, నగదు అపహరించిన ఘటనలు రెండు చోటు చేసుకోవడంతో ఎస్పీ జానకి వీటిని కట్టడి చేసేందుకు ట్రాఫిక్ నెంబర్లు ఇవ్వాలని నిర్ణయించారు. ట్రాఫిక్ నెంబరు పెద్దసైజులో ఉండటం వల్ల వాహనదారులు ఆటోలు ఎక్కేటప్పుడు ఈ నెంబర్ గుర్తిం చుకునే అవకాశం ఉండటంతో పాటు సీసీ కెమెరాల్లో నెంబర్ స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది. అందుకే ఆదివారం నుంచి ఈ నెల 25 వరకు పట్టణ ఆటో యజమానులు, ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లకు ఆటోలను తీసుకెళ్లి నెంబర్‌లు వేయించుకో వాలని ఎస్పీ పిలుపునిచ్చారు. నెంబర్ ఇచ్చే టప్పుడు ఆటోడ్రైవర్, యజమానికి సం బంధించిన వివరాలు, ఆధార్ వివరాలు ఆన్ లైన్ నమోదు చేసుకుంటారు. దీంతో ట్రాఫిక్ నెంబర్ కొట్టగానే ఆటోకు సంబంధించిన వివరాలు తెలియనున్నాయి. దీన్ని బట్టి ఆటోలో నేరం జరిగినా, మరేదైన నేరం జరిగినా సులువుగా ఆటోను గుర్తించేందుకు అకాశం ఉంటుంది.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి


పవర్ హౌస్

ఆత్మకూరు, జూలై 20: ఎగువ నుంచి ఆశించిన మేర వరద రావడంతో ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో 11 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎగువ ఉత్పత్తి కేంద్రం ద్వారా ఐదు యూనిట్లు ప్రారంభించి, 5.220 మిలియన్ యూనిట్లు, అలాగే దిగువ ఉత్పత్తి కేంద్రం ద్వారా ఆరు యూ నిట్లు ప్రారంభించి 7.282 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ఎగువ నుంచి ఇదే స్థాయిలో వరద వస్తే రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. విద్యుత్పత్తి పట్ల అధికారులు అప్రమత్తంగా ఉన్నారని ఎప్పటికప్పుడు ఉత్పత్తి వివరాలను పరిశీలిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఎస్ఈ సురేష్, డీఈలు పవన్ కుమార్, రాజు, రూపేష్, దర్బార్ వలి, తో పాటు జెన్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అమ్రాబాద్, జూలై 20: నాగర్ కర్నూల్ జిల్లా పదర మండల పరిధిలో ఇప్పలపల్లికి చెందిన మోగవత్ మత్రు (35) అనే వ్యక్తి అదృశ్యం పై కేసు నమోదు చేసునట్లు పదర ఎస్ఐ రాజు శనివారం తెలిపారు. ఈ నెల 19న పిండి గిర్ని మెకానిక్‌ను తీసుకువస్తానని ఇంటి నుంచి వెళ్లిన మత్రు తిరిగి రాలేదు. దాంతో అతడి భార్య మల్లిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో తొమ్మిది గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

తాడూరు, జూలై 20 : విద్యుదాఘాతంతో తొమ్మిది గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రంలో శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లయ్య గొర్రెల కాపరి. సాయంత్రం మేతకు వెళ్లి తిరిగి గొర్రెల మంద ఇంటికి వచ్చింది. అప్పటికే ఇంటి వద్ద ఉన్న షెడ్డుకు తెగిన విద్యుత్ వైర్లు తగిలి షార్ట్‌సర్క్యూట్ కావడంతో ప్రమాదవశాత్తు తొమ్మిది గొర్రెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. అప్రమత్తమైన మల్లయ్య మిగతా వాటిని అటువైపు వెళ్లకుండా జాగ్రత్త పడ్డాడు. మొత్తంగా పెను ప్రమాదం తప్పింది. మృతి చెందిన గొర్రెలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

కిలాడీ జోడి

- వృద్ధమహిళలే లక్ష్యంగా చోరీలు
- ఆటోలో ఎక్కించుకొని ఊరి బయటకు తీసుకెళ్లి దోపిడీ
- ఐదు కేసుల్లో తొమ్మిది తులాలు అపహరణ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, జూలై 20: అది కిలాడీ జోడి.. ఒంటరిగా వయసుపైబడిన మహిళలను లక్ష్యంగా చేసుకుని వారితో మాటలు కలుపుతారు. మాటల్లో పెట్టి వాళ్లు ఎక్కడికెళ్లాలో అడుగుతారు. తాము అక్కడికే వెళ్తున్నామని, ఆటోలో దిగబెడతాం రండంటూ ఆటోలో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి చంపుతామని బెదిరించి మెడలో ఉన్న పుస్తెలతాడు చెవిదుద్దులు , నల్లపూసలు ఇలా నిలువుదోపిడి చేసి వారిని అక్కడే వదిలేసి వెళ్లిపోతారు. ఇలా ఐదు మంది మహిళల నుంచి నగలు కాజేసిన ఈ కిలాడీ జోడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకుని కటకటాలకు పంపించారు. శనివారం మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మక్తల్ మండలం రుద్రసముద్రం గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్(38) పదేళ్లక్రితం మహబూబ్‌నగర్‌కు వచ్చి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యను వదిలిపెట్టిన అత డి కి కొద్దిరోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర సబాపతి ఉమ అనే మహిళ పరిచయమైంది. ఇద్దరూ కలిసి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో తమ అవసరాల కోసం దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ ఆటోలో ప్రయాణిస్తూ బస్టాప్ దగ్గర ఒంటరిగా ఉన్న ఆమాయక వృద్ధ మహిళలను టార్గెట్ చేసి వారి ఒంటిపై ఉన్న నగలను అపహరించడం పనిగా పెట్టుకున్నారు. వారితో పరిచయం ఏర్పాటుచేసుకుని ఎక్కడికెళ్లాలంటూ అడుగుతారు. తాము అటువైపే వెళ్తున్నామని మీ ఇంటివద్ద దిగబెడతాం ఆటో ఎక్కండంటూ న మ్మబలికి ఆటో ఎక్కించుకుంటారు. నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి వారిని బెదిరించి నగలు అపహరిస్తారు. ఇలా ధర్మాపూర్ శివారులో ఓ మహిళను, నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్ల గేట్, రుద్రారం గ్రామ శివారులో మరో మహిళతోపాటు టూటౌన్ పరిధిలోని రైస్‌మిల్లుల దగ్గర ఇద్దరు మహిళల నుంచి నగలు అపహరించారు. ఏడాది వ్యవధిలోనే ఐదు దొంగతనాలు చేశారు. ఈ కేసులను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిఘా పెంచారు. ఆటోల తనిఖీలో శనివారం ఈ కిలాడీ జోడి పోలీసులకు చిక్కడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా దొంగతనాలు విషయం వెలుగుచూసింది. వారి వద్ద చోరీకి పాల్పడ్డ తొమ్మిది తులాల బంగారు నగలను రికవరి చేశారు. సమావేశంలో రూరల్ సీఐ గాంధీనాయక్, రూరల్ ఎస్సై విజయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర చైర్మన్‌కు సమస్యలపై విన్నపం

మన్ననూర్, జూలై 20: ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కాల్వ సుజాతను మహాసభ రాష్ట్ర నాయకులు సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణలు శనివారం కలిశారు. గ్రామాల్లో చిరు వ్యాపారాలు చేసి జీవనం సాగిస్తున్నారని, వారందరికీ వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. గ్రామాల్లో నిరుపేదలైన వైశ్యులకు పక్కా గృహాలు లేవని, ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కార్పొరేషన్ ద్వారా ప్రత్యేకంగా కేటాయించేలా చూడాలన్నారు. నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందివ్వాలని, పైచదువులకు ప్రత్యేక ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. స్పందించిన చైర్మన్ సుజాత కార్పొరేషన్‌కు నిధులు మంజూరయ్యాక ఆర్యవైశ్యుల అభున్నతికి కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా మహాసభ నాయకులకు ఆమె స్పష్టమైన హామీ ఇచ్చారు.

అలంపూరు ఆలయాలను దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి చీర, గాజులను న్యాయమూర్తికి అందిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు

అలంపూరు జూలై 20: జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను తెలంగాణ హై కోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ముందుగా వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి ఆలయంలో గణపతి పూజ, అభి షేకం, అమ్మవారి ఆలయంలో అర్చన వంటి విశేష పూజలను చేసి అ మ్మవారి చీర గాజులను అందజేసి, తీర్థ ప్రసాదాలను అందించారు. వీరి వెం ట అలంపూరు జుడిషియల్ కోర్టు న్యాయాధికారి కమలాపురం కవిత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ పేరుతో రైతులను ముంచిన కాంగ్రెస్

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

నారాయణపేట టౌన్, జూలై 20 : రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ రైతులను ముంచిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే లోకల్‌బాడీ ఎన్నికల్లో సత్తా చాటుదామన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి షరతుల పేరుతో రైతులను మోసం చేసిందన్నారు. రైతు భరోసా ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. మహిళలకు రూ. 2500 ఆర్థిక సహాయం ఏమైందో చెప్పాలన్నారు. బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. మూడోసారి మోదీ గెలుపులో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం ఉండటం గొప్ప విషయమన్నారు. కేంద్రం ప్రజారంజక పనులు, పథకాలు అమలు చేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందన్నారు. తనకు 20 వేల మెజార్టీ ఇచ్చిన నారాయణ పేటకు రుణపడి ఉంటానని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయిందన్నారు. భవిష్యత్‌లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నాయకులు నాగురావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, కొండయ్య, పగడాకుల శ్రీనివాస్, సత్యరఘుపాల్ తదితరులు పాల్గొన్నారు.

శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

నారాయణపేట: నారాయణపేట శక్తిపీఠంలో శనివారం ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శక్తిపీఠం వ్యవస్థాపకుడు శాంతనంద స్వామి ఎంపీని సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రతంగ్‌పాండురెడ్డి, సత్యయాదవ్, రఘువీర్ యాదవ్, అయ్యప్ప, శ్రీపాద్, శక్తి పీఠం సభ్యులు పాల్గొన్నారు.

పొలాల్లో చిరుత సంచారం

- ప్రాణభయంతో అన్నదాతలు
- చిరుత సంచార ప్రదేశాన్ని పరిశీలించిన ఫారెస్టు అధికారులు



పోలేపల్లిలో చిరుత సంచరించిన ప్రదేశంలో రైతులతో మాట్లాడుతున్న ఫారెస్టు అధికారులు

బిజినేపల్లి, జూలై 20 : కొంతకాలంగా చిరుత పులుల అలకిడితో చుట్టూ పక్కల గిరిజన వాసులకు కంటిపై కునుకు లేదు. చీకటి పడిందంటే పొలాల్లో ఉండేందుకు జంకుతున్నారు. శుక్రవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పోలేపల్లి గ్రామంలోని నాగమ్మ కుంట శివారులోని పొలంలో చిరుత సంచారాన్ని రాములు అనే రైతు దూరం నుంచి సెల్‌ఫోన్‌లో వీడియో తీసి గ్రామస్థులకు సమాచారం ఇచ్చాడు. దీంతో బెంబేలెత్తిన అన్నదాతలు ప్రాణభయంతో పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. విషయాన్ని ఫారెస్టు అధికారులకు తెలిపారు. శనివారం తెల్లవారు జామున ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ చంటి పోలేపల్లి గ్రామ శివారులో చిరుత కనిపించిన ప్రదేశానికి వెళ్లి పాదముద్రలను పరిశీలించారు. పొలాలకు ఒక్కరుగా కాకుండా ఇద్దరు ముగ్గురుగా గుంపులుగా వెళ్లాలని సూచించారు. అలాగే వన్యప్రాణులకు ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఉన్నతాధికారులను సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

విద్యుత్ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం

- విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ భిక్షపతి



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న చీఫ్ జనరల్ మేనేజర్ భిక్షపతి

తిమ్మాజిపేట, జూలై 20 : గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని చీఫ్ జనరల్ మేనేజర్ భిక్షపతి అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని చేగుంట గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం చేపట్టిన ఆందోళనకు స్పందిస్తూ శనివారం గొరిట గ్రామంలో గల విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. సాంకేతిక కారణాల దృష్ట్యా విద్యుత్ సమస్యలు నెలకొన్నాయన్నారు. సబ్‌స్టేషన్‌లో మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని, త్వరలో అధికారులతో కలిసి పర్యవేక్షిస్తూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. డివిజనల్ ఇంజనీర్ శ్రీధరశెట్టి, ఏడీ ఆది శేషయ్య, ఏఈ సాయన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

రాజోలి, జూలై 20 : పొలం తగాదాల్లో దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రాజోలి హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చిన్న ధన్వాడ గ్రామానికి చెందిన ఏవీ మోహన్ రెడ్డికి మండలంలోని మాన్‌దొడ్డి గ్రామ శివారులో ఉన్న పొలం విషయంలో కొంత కాలంగా గొడవలు ఉన్నాయి. శనివారం బాధితుడు చిన్నధన్వాడ గ్రామం నుంచి తన పొలానికి వెళ్తుండగా మాన్‌దొడ్డి గ్రామం శివారులోని సబ్ స్టేషన్ సమీపంలో తన తమ్ముళ్లు ఏ. రవి ప్రకాష్ రెడ్డి, ఏ. లోకేశ్వర్ రెడ్డి ఇద్దరు తనను అడ్డుకుని దాడి చేశారన్నారు. దాడిలో తన కుడికాలుకు గాయం అయ్యిందని, వారిద్దరి నుంచి ప్రాణహాని ఉందని తెలుపుతూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం

- సరళాసాగర్ లిఫ్టు మోటార్లు నడుస్తున్నా ప్రాజెక్టులోకి చేరని నీరు
- ఐదు మోటార్లలో ఒకటి మాత్రమే వినియోగంలో
- తుకాలకు కూడా అందని నీరు
- అయోమయంలో అన్నదాతలు

మదనాపురం, జూలై 20: ఊరు గొప్ప పేరు దిబ్బ అనే సామెత సరళసాగర్ ప్రాజెక్టుకు సరిగ్గా వర్తిస్తుంది. సరళాసాగర్ అనగానే అందరికి గుర్తుకు వచ్చేది ఆటోమెటిక్ సైఫన్ సిస్టమ్. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీరు వచ్చిన వెంటనే గాలి ఒత్తిడితో సైఫన్‌లు తెరుచుకుని నీటిని కిందకు వదులుతాయి. ఇలాంటి సిస్టం కలిగిన సరళాసాగర్ ఆసియా ఖండంలోనే మొదటిది. ప్రపంచంలో రెండవది. అటువంటి ప్రాజెక్టు పాలకుల వలన మూలన పడే పరిస్థితికి వచ్చింది. గతంలో భారీ వర్షాలు కురిసి వరద నీరు వస్తేనే ప్రాజెక్టు నిండేది. ప్రాజెక్టులో ఎప్పుడు నీరు ఉండాలనే ఉద్దేశంతో 2006 సంవత్సరంలో రామన్‌పాడు రిజర్వాయర్ బ్యాక్ వాటర్ వద్ద సరళాసాగర్ లిఫ్టును అప్పటి మంత్రి చిన్నారెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి వర్షాకాలంలో రామన్‌పాడుకు నీరు వచ్చిన వెంటనే లిఫ్టును ప్రారంభించి సరళాసాగర్‌ను నింపి ఆయకట్టుకు వదిలేవారు. అంతేగాక గత ప్రభుత్వంలో కేఎల్‌ఐ



సరళాసాగర్ ప్రాజెక్టు

నీరు వచ్చే విధంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేసిన కృషి ఫలించి వరుసగా నాలుగు సంవత్సరాలు సరళాసాగర్ నిండి సైఫన్‌లు తెరుచుకున్నాయి.



సరళాసాగర్ ఎత్తిపోతల పథకం

వెలవెలబోతున్న సరళాసాగర్

ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పెద్ద పెద్ద డ్యామ్‌లు నిండి నీటిని కిందకు వదులుతున్నారు. కేవలం అర (0.5)టీఎంసీ సామర్థ్యం ఉన్న సరళాసాగర్‌కు నీరు రాకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. నెల రోజుల కిందటే లిఫ్టు మోటార్లు స్టార్ట్ చేసి పంపింగ్ చేస్తున్నా తుకాలకు కూడా నీరు రాలేదు. దీనికి మరో కారణం పాలకుల నిర్లక్ష్యమే. ఐదు మోటార్లకు గాను కేవలం రెండు మోటార్లే పని చేస్తుండడం, రెండు ట్రాన్స్‌ఫార్మర్లల్లో ఒక్కటే వినియోగంలో ఉండడం వలన ఈ పరిస్థితి దాపరించిందని రైతులు వాపోతున్నారు. శ్రీశైలానికి ఇప్పుడు వరద మొదలు కావడంతో కేఎల్‌ఐ నీరు ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేదు. లిఫ్టు కమిటీ మోటార్లను ముందుగానే రిపేరు చేయించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. దీని మీదనే మండలంలో ఎక్కువ రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పటికైనా రిపేరులో ఉన్న వాటిని బాగుచేయించి సరళాసాగర్‌ను నింపాలని రైతులు కోరుతున్నారు.

తుకాలకు నీటిని వదలాలి



సరళాసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తుకాలకు నీటిని వదలాలి. తుకాలు పోసుకోవడానికి ఇప్పుడే అనువైన సమయం. ఈ పది రోజులు దాటిన తరువాత నీటిని వదిలినా లాభం లేదు. లేదంటే కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఎన్నుకోవాలి.

- పుట్టి కురుమన్న, రైతు

రైతులు శిస్తు చెల్లించాలి




రైతులు సకాలంలో శిస్తులు చెల్లించాలి. కమిటీలో డబ్బులు లేకపోవడంతోనే మోటార్లను రిపేరు చేయించలే. గతంలోనే మరమ్మతు కోసం అప్పులు చేసినం. వారం రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్, మోటార్లను బాగు చేయిస్తాం.

- వెంకటయ్య సరళాసాగర్ లిఫ్టు అధ్యక్షుడు

ప్రైవేట్ ల్యాబ్‌లకు రెఫర్ చేస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది

- బయాప్సీ బయటికి వెళ్తున్న పట్టింపు కరువు

వనపర్తి వైద్యవిభాగం, జూలై 20: ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై, వైద్య సిబ్బందిపై ఉంటుంది. కానీ వనపర్తి జిల్లా జనరల్ ఆస్పత్రిలో మాత్రం వైద్యుల నిర్లక్ష్యం కారణంగా సాధారణ పరీక్షలు చేయించుకోవాలంటే కూడా ప్రైవేటు ల్యాబ్‌ల వైపే చూడాల్సిన దుస్థితి నెలకొంది. అంతేకాకుండా వైద్యులకు తెలియకుండా బయటికి వెళ్లకూడని అత్యంత విలువైన బయాప్సీ శ్యాంపిల్స్ కూడా ఏమాత్రం వైద్యులకు సమాచారం లేకుండా ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులు స్వేచ్ఛగా తీసుకెళ్తున్నారు. అలాంటి సంఘటనే శనివారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి....వనపర్తి పట్టణానికి చెందిన 50 సంవత్సరాల వయసు గల ఫరీదా బేగం అనే మహిళకు గురువారం అర్ధరాత్రి తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. వెంటనే తన కుమారుడు జిల్లా జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించుకుని అదే రాత్రి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు శుక్రవారం మళ్లీ కడుపునొప్పి రావడంతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. పేషంట్‌కు స్కానింగ్ చేయించుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి ప్రైవేట్ స్కానింగ్ కేంద్రానికి రెఫర్ చేశారు. స్కానింగ్ రిపోర్టులో అపెండిక్స్ అని తేలింది. అంతటితోనే ఆగకుండా వరస క్రమం ప్రకారం మంగళవారం ఆపరేషన్ చేస్తామని వైద్యులు అంటుంటే రోగి మాత్రం విపరీతమైన కడుపునొప్పితో అల్లుడుతుంది. దీంతో కొందరు కలుగజేసుకుని వైద్యులను నిలదీయగా అప్పటికప్పుడు వైద్యులు రోగిని ఆపరేషన్ రూంకు తరలించి అపెండిక్స్ ఆపరేషన్ చేశారు. అంతకు ముందు రోగికి నిర్వహించాల్సిన వైద్య పరీక్షలు సైతం (ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ) ప్రైవేటులో చేయించుకోవాలని విధుల్లో ఉన్న ఎల్‌టీ సంబంధిత రోగి కుమారుడికి సెలవిచ్చాడు. అవి కూడా ప్రైవేటులోనే చేయించుకున్నారు. కానీ అసలు తతంగం ఇక్కడే మొదలమైంది.



వైద్యుల ప్రమేయం లేకుండానే తెల్ల కాగితంపై ప్రైవేటు ల్యాబ్‌కు రెఫర్

రోగికి ఆపరేషన్ చేసి తొలగించిన అపెండెక్స్ పేగు ప్రమాద భరితంగా మారి గడ్డలా మారడంతో బయాప్సీ చేయించాల్సిన పరీక్షలు కూడా వైద్యులకు తెలియకపోవడంతో ఆసుపత్రి పర్యవేక్షణ పూర్తిగా పడకేసిందనే దానికి నిదర్శనంగా మారింది. బయాప్సీకి పంపి పేగు ఎందుకు గడ్డలా మారిందని, క్యాన్సర్, ఇతర ప్రమాదకరమైన రోగామేదైన ఉందా అని తెల్సుకోవాల్సిన బయాప్సీ స్వేచ్ఛగా ప్రైవేటు వ్యక్తులు తీసుకెళ్తుంటే, వాటికి ఆస్పత్రిలోని సిబ్బందే సహకరిస్తుంటే వైద్యులు ఎందుకు పట్టించుకోవడం లేదనేదే అందరిలో కలుగుతున్న ప్రశ్న. ఏ మాత్రం వైద్యుల లెటర్ గాని, రెఫరల్ లెటర్ గానీ లేకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మింట్ అయిన రోగి పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్ నిర్వహకులు వచ్చి నమూనాలు సేకరిస్తుంటే ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఏమి చేస్తున్నారో జిల్లా ఉన్నతాధికారులు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

ఆపిల్ ఫోన్ కోసం హత్యాయత్నం

మహబూబ్‌నగర్, జూలై 20: ఆపిల్‌ఫోన్‌ను దక్కించుకునేందుకు ఏకంగా హత్యచేసేందుకు ప్రయత్నించిన ఘటన మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని వీరన్నపేటకు చెందిన సయ్యద్‌మస్తాన్ టీడీగుట్ట ఫైర్‌స్టేషన్‌కు చెందిన అక్తర్ ఇద్దరూ స్నేహితులు. అయితే ఈనెల 12న అక్తర్ వద్ద ఉన్న ఆపిల్‌ఫోన్‌ను మస్తాన్ తీసుకెళ్లాడు. మరుసటి రోజు అక్తర్ ఫోన్ ఇవ్వాలని ఫోన్ చేయగా ఒక్కడివే వీరన్నపేటలోని తన ఇంటికి వస్తే ఫోన్ ఇస్తానని చెప్పడంతో అక్తర్ ఫోన్ కోసం వీరన్నపేటకు వెళ్లాడు. అక్కడ ఫోన్ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఫోన్ ఇవ్వను వెళ్లిపోవాలని మస్తాన్ చెప్పినా అక్తర్ అక్కడినుంచి వెళ్లకపోవడంతో ఎలాగైనా ఫోన్ దక్కించుకోవాలని మస్తాన్ అక్తర్‌ను హత్య చేసేందుకు ఇంట్లో ఉన్న కత్తి తీసుకువచ్చి అతని డొక్కలో పొడిచాడు. అనంతరం బైక్‌పై ఎక్కించుకుని ముళ్లపొదలో పారవేయాలని నిర్ణయించుకున్నాడు. తరువాత భయపడి క్లాక్‌టవర్ సర్కిల్‌లో వదిలిపెట్టి పరారయ్యాడు. గాయపడ్డ అక్తర్ తండ్రి ఎండి ఆసిఫ్‌కు విషయం చెప్పడంతో ఈనెల 14న తండ్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన సీఐ అప్పయ్య శనివారం నిందితుడు సయ్యద్‌మస్తాన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద సెల్‌ఫోన్, హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

టీచర్ల బదిలీల్లో లీలలెన్నో!

- తప్పులు చేస్తున్న కమిటీలోని కొందరు
- పదోన్నతికి అర్హత ఉన్న మరొకరికి ప్రమోషన్
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జోక్యంతో బాధిత టీచర్లకు న్యాయం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 20 : ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల్లో లీలలెన్నో జరుగుతున్నాయి. అయినవారిని అందలమెక్కిస్తుండటంతో అర్హులైన ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోంది. జిల్లా విద్యాశాఖ అధికారి ఉపాధ్యాయుల బదిలీల, పదోన్నతుల, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించేందుకు డీఈవో కార్యాలయ సిబ్బంది, సీనియర్ జీహెచ్ఎంలు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులతో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీకి ఒక్కో సబ్జెక్ట్ బాధ్యత అప్పగించారు. కమిటీ సభ్యులు బదిలీలకు, పదోన్నలకు సంబంధించి వచ్చిన దర ఖాస్తులలో సర్వీస్, ఇతర కేటగిరి వివరణలను పూర్తిగా పరిశీలించాల్సి ఉంటుంది. ఇందులో ఎవరైన తప్పు చేస్తే కమిటీ సభ్యులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. కానీ, కొందరు కమిటీ సభ్యులు అర్హత లేని వారిని జాబితాల్లో చేర్చి అన్నీ అర్హతలున్నవారిని జాబితా నుంచి తొలగించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

జీహెచ్ఎం బదిలీల నుంచి ఎస్జీటీల వరకు తప్పిదాలే ...

కమిటీ సభ్యులుగా ఉన్న కొందరు ప్రధానోపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లను ఇష్టానుసారంగా వాడుకున్నారు. తమను ఎవరు ఏమి చేయలేరనే ధీమాతో భార్య, భర్త పనిచేసే చోటుకు దగ్గర ప్లేసులు ఉన్నా వాటిని కాదని తమకు అనుకూలంగా



బదిలీల, పదోన్నతుల పత్రాలను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్ (ఫైల్)

ఉన్న ప్లేస్‌ను తీసుకున్నారు. హెచ్ఆర్ఏ ప్లేసులు పొందారు. ఇంతా జరుగుతున్నా వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తప్పులు చేసిన వారినే బదిలీల కమిటీల్లో సభ్యులుగా నియమించడంపై పలు విమర్శలు వస్తున్నాయి. గతేడాది జీహెచ్ఎం బదిలీల్లో తప్పు చేసి 15 మంది జీహెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు ఇచ్చి చేపట్టిన విచారణ చివరి దశలో ఉంది. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీల బదిలీల్లో ఐదుగురు టీచర్లు స్పౌజ్ పాయింట్ల వినియోగంలో తప్పుచేశారని తెలింది. వీరికి షోకాజ్ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీల్లో తప్పిదాలు చేసిన వారంతా పలు సంఘాల నాయకులు, కమిటీ సభ్యులు ఉండటంపై పలు అనుమానాలకు తావు ఇస్తోంది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడితే మరింత మందిపై వేటు పడే అవకాశం ఉన్నది. మొత్తంగా ఇప్పటి వరకు 24 ఉపాధ్యాయులకు షోకాజ్‌నోటీసులు ఇచ్చారు.

సీనియార్టీ పదోన్నతుల జాబితాలో

తెలుగు సీనియార్టీలో కమిటీ సభ్యులుగా ఉన్న ఇద్దరు తప్పు చేయడంతో విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు డీఈవో ఈ నెల 16న షోకాజ్ నోటీసులు జారీ చేశారు. భాషాపండితుల పదోన్నతుల్లో (అప్ గ్రేడేషన్)లో ఓ టీచర్‌కు పదోన్నతికి అర్హత ఉన్న జాబితా నుంచి తప్పించి ఆ స్థానంలో మరొకరికి పేరు చేర్చారు. దీంతో ఆ టీచర్‌కు పదోన్నతి రాలేదు. బాధిత టీచర్ తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డిని కలిసింది. దీంతో ఆయన పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిని సీరియస్ తీసుకున్న కమిషనర్ సదరు టీచర్‌కు న్యాయం చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించడంతో బాధ్యులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. బాధిత టీచర్‌కు న్యాయం చేయకపోవడంతో మరోమారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ జడ్చర్ల మండల పరిధిని అల్వాన్‌పల్లి యూపీఎస్‌లో పని చేస్తున్న పుష్పమ్మకు పదోన్నతి కల్పిస్తూ సీసీకుంట మండ పరిధిలో ఉన్న ఉంద్యాల ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు.

పాలమూరు జిల్లాలోనే తప్పులు

రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. బదిలీల పదోన్నతుల ప్రక్రియ అన్ని జిల్లాలో పారదర్శకంగా జరిగింది. కాని పాలమూరు జిల్లాలో మాత్రం స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం, సీనియార్టీ, జాబితా తప్పిదాలు జరిగాయి. కమిటీ సభ్యులు కూడా తప్పులు చేయడం సిగ్గుచేటు. వారిపై సస్పెన్షన్ వేటు వేయాలి. మరోసారి ఇలా జరగకుండా చూడాలి.

- గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు

తప్పిదాలు సరి చేశాం

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో కొందరు తప్పులు చేశారు. కొన్ని సాంకేతిక తప్పులు జరిగాయి. కమిటీలో ఉండే కొందరు తప్పు చేశారని గుర్తించి షోకాజ్ నోటీసులు ఇచ్చాం. స్పౌజ్ పాయింట్ల విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన టీచర్లపై విచారణ జరుగుతోంది. కొన్ని కారణాల వల్ల ఓ టీచర్‌కు అన్యాయం జరిగితే ఉన్నతాధికారుల ఆదేశాల సదరు ఉపాధ్యాయురాలికి పదోన్నతి ఉత్తర్వులు ఇచ్చాం.

- ఎ.రవీందర్, డీఈవో మహబూబ్‌నగర్

నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరణ



వట్టెం నవోదయ విద్యాలయం ప్రవేశ ద్వారం

బిజినేపల్లి, జూలై 20 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరం 2025-26కు గాను వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతి ప్రవేశం పొందేందుకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 16లోగా ఆన్‌లైన్ ద్వారా అప్లై చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష 2025, జనవరి 18న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక వారు సాధించిన మార్కుల మెరిట్ ద్వారా ఎంపిక ఉంటుందని తెలిపారు.

మూడో రోజు సజావుగా డీఎస్సీ పరీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 20 : డీఎస్సీ పరీక్ష మహబూబ్‌నగర్‌లో మూడో రోజు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం ధర్మపూర్ జేపీఎన్‌సీఈ పరీక్ష కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 180 మంది అభ్యర్థులకు గాను 142 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 180 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 169 మంది హాజరై 11 మంది గైర్హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 108 మందికి గాను 89 మంది హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు ఏడుగురికి గాను ఐదుగురు అభ్యర్థులు హాజరుకాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అలంపూర్ చౌరస్తా, జూలై 20: గద్వాల జిల్లా ఉండవల్లి మండల కేంద్రంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కర్నూలు జిల్లా పెద్దపాడు గ్రామానికి చెందిన కుర్వ అశోక్‌కుమార్ అనే వ్యక్తి తన సొంత ఆటోలో ఉండవల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ రేషన్‌బియ్యాన్ని సేకరించి కర్నూలుకు తరలించేవాడు. ఇదేక్రమంలో శనివారం మండల కేంద్రం మీదుగా ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని కర్నూలుకు తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఆటోడ్రైవర్

జడ్చర్ల, జూలై 20 : ఆటోలో ప్రయాణికుడు మరిచిపోయిన మొబైల్‌ఫోన్‌ను అందజేసి ఆటో డ్రైవర్ నిజాయతీని చాటుకున్న సంఘటన శనివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటుచేసుకుంది. టంకర గ్రామానికి చెందిన వెంకటేశ్, తన బంధువులతో కలిసి ఇంపీరియల్ గార్డెన్స్ నుంచి జడ్చర్ల క్రాస్‌రోడ్డు వరకు పట్టణానికి చెందిన డ్రైవర్ సంజయ్ ఆటోలో ప్రయాణించారు. అనంతరం క్రాస్‌రోడ్డు వద్ద వారంతా దిగివెళ్లిపోయారు. అదే సందర్భంలో ఆటోలోనే తన మొబైల్‌ను మరిచిపోయాడు. కొద్దిసేపు అనంతరం మొబైల్‌ను చూసుకున్న వెంకటేశ్, ఆటోలో మరిచిపోయినట్లుగా గుర్తించాడు. వెంటనే మొబైల్‌కు ఫోన్ చేయగా, తన వద్దనే ఉందని, వచ్చి తీసుకెళ్లాలంటూ వెంకటేశ్‌కు సంజయ్ సూచించాడు. కాగా మొబైల్ ఫోన్‌ను వెంకటేశ్‌కు ఆటో యూనియన్ అధ్యక్షుడు షేక్‌హాజీ సమక్షంలో ఆటో డ్రైవర్ సంజయ్ అందచేసి నిజాయితీని చాటుకున్నాడు.

ఆసుపత్రిలో మెగా కార్డియాక్ క్యాంపు ప్రారంభం



ఏరియా ఆసుపత్రిలో మెగా కార్డియాక్ క్యాంపు ప్రారంభించిన సీబీఎం ట్రస్ట్ చైర్మన్ అనురాధ

అచ్చంపేట, జూలై 20: అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో కేర్ ఆసుపత్రి వారి సారథ్యంలో ఏర్పాటు చేసిన మెగా కార్డియాక్ క్యాంపును సీబీఎం ట్రస్ట్ చైర్మన్ అనురాధ, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజలు వైద్యపరంగా ఎటువంటి ఇబ్బందులు పడకుండా మెగా కార్డియా క్యాంపును కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా గుండె, ఎముకలు న్యూరో వంటి వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. నల్లమల ప్రాంతంలో ఏ ఒక్కరు అనారోగ్యంతో బాధపడవద్దనేది ఎమ్మెల్యే లక్ష్యమని సీబీఎం ట్రస్ట్ చైర్మన్ అనురాధ అన్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల రోగులకు వైద్యం అందించేలా సిబ్బందితో పాటు పరికరాలను ఏర్పాటు చేసి వైద్యం అందిస్తామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభు, డాక్టర్లు మహేష్, కేర్ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది సాహితీ తదితరులు పాల్గొన్నారు.

వృత్తిలో రాణించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించాలి

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



ఫొటో, వీడియో గ్రాఫర్ ప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

కందనూలు, జూలై 20 : ఫొటో, వీడియోగ్రఫీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు వస్తున్న మార్పులను అధిగమించేందుకు తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి కోరారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఆధునిక సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఫొటో చిత్రీకరణలో అనేక మార్పులు వస్తున్నాయని, వాటిని అధ్యయనం చేసేందుకు ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఎల్లప్పుడు మీకు అందుబాటులో ఉంటానని అన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఊర్కొండ, జూలై 20: రాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండి వారికి రాజులుగా చేయడం కోసం అహర్నిషలు కృషి చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేయడం చరిత్రాత్మక నిర్ణయమని, తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్న రైతులకు ఇచ్చిన మాట కోసం పరితపించి వారి అభ్యున్నతి కోసం రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతున్నదని అన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, యువజన విభాగం మండల మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు ఆదినారాయణ, కంఠం శ్రీశైలం, దారరాజు తదితరులు ఉన్నారు.

చౌటచెరువు కట్ట బ్రిడ్జిని నాణ్యతగా చేపట్టాలి

పెంట్లవెల్లి, జూలై 20 : పెంట్లవెల్లి చౌటచెరువు కట్ట బ్రిడ్జిని నాణ్యతగా చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ అధికారి అయిన కొల్లాపూర్ ఏఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంట్లవెల్లి చౌటచెరువు కట్ట నిర్మాణంలో నాసిరకం ఇసుక వాడుతున్నారని వారన్నారు. అదేవిధంగా మట్టి వంటి మొర్రంతో కలిపి నిర్మాణ పనులు చేపడుతున్నారని వారన్నారు. గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళల్లో పనులు కొనసాగిస్తున్నారని వారన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంపై అధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్నపాల్గొన్నారు.

హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మర్రి



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దంపతులు

కందనూలు, జూలై 20 : ఆధ్యాత్మిక చింతనతో యజ్ఞయాగాదులు చేయడంతో సకల జీవకోటి సుభిక్షంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి దివ్య మంగళ శాసనములతో నిర్వహించే ఆయుత చండీ అతిరుద్రయాగం, సుదర్శన చండీ హోమాల్లో శనివారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దంపతులకు కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం యాగశాలలో హోమం నిర్వహించి శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి ఆశీస్సులు తీసుకున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి: కలెక్టర్

నాగర్‌కర్నూల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా నాగర్‌కర్నూల్ జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయని రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున రెవెన్యూ, అత్యవసర శాఖల అధికారులు అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సంబంధిత శాఖల అధికారులకు శనివారం ఒక ప్రకటనలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వాతావరణ శాఖ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారి చేసిన నేపథ్యంలో రానున్న రెండు రోజులు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున, జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రైతు వేదికల్లో సహాయ కేంద్రాల ఏర్పాటు

చారకొండ, జూలై 20: లక్ష లోపు రుణమాఫీ కాని రైతుల కోసం మండలంలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి చిన్న హుసేన్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చంద్రాయన్‌పల్లి, తిమ్మాయిపల్లి, శేరిఅప్పారెడ్డిపల్లి, సిర్సనగండ్లలోని రైతువేదికల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద రైతుల నుంచి దరఖాస్తులను మండల వ్యవసాయశాఖ అధికారి చిన్నహుసేన్‌యాదవ్ స్వీకరించారు. ఏఈవోలు వంశీ, అనూష, రైతులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యం

కల్వకుర్తి, జూలై 20 : విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి, ఎంప్లాయీస్ వాయిస్ ఎడిటర్ కేవీలు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేదింటి ఆడబిడ్డలు ఉత్తమ ఫలితాలు సాధించడంతో ఎంప్లాయీస్ వాయిస్ ఎడిటర్ కేవీ రూ.30వేల ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు ఏపీ మల్లయ్య, శ్రీధర్, అధ్యాపకులు వేణు, సదానందంగౌడ్, రమాకాంత్, మహబూబ్‌ఆలీ, మల్లేష్, రాజేష్, గిరిబాబు, పరుశరామ్, శ్రీనివాస్, లక్ష్మయ్య, సంతోష్‌గౌడ్, సిబ్బంది బాలయ్య తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా ఎదగాలి

తాడూరు, జూలై 20 : విద్యార్థులు తమ తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశయాలకనుగుణంగా వారి కష్టాన్ని గుర్తించి, వారి ఇష్టానికనుగుణంగా ఉన్నత స్థాయి విద్యనభ్యసించి ఉన్నతమైన స్థానానికి ఎదగాలని నాగర్‌కర్నూల్ జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి సబిత కోరారు. తాడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డీఈవో గోవిందరాజులు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు పర్వత్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు శ్రీనివాసులుగుప్తా, మధు, భవానిబాయి, పవన్, శివరాం, ఆర్య కోర్టు సిబ్బంది కేశవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్‌లైన్‌లో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

కందనూలు, జూలై 20: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైంది. ఏ కాలనీలో చూసినా కుక్కల గుంపు కన్పించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కలు చిన్న పిల్లలు బయటకు వెళ్తే వారిపై ఎగబడి దాడి చేస్తున్నాయి. అధికార యంత్రాంగం కుక్కలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పిల్లలను బయటకు పంపాలంటే తీవ్ర భయాందోళనకు గురవుతున్నట్లు పట్టణవాసులు పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలో కుక్కల బెడదతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న పిల్లలతో పాటు పెద్దవారిపై కూడా కుక్కలు దాడి చేసి కరుస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి నేటి వరకు 1743మందిపై దాడి చేసినట్లు ప్రభుత్వ రికార్డుల్లో నమోదైంది.

● కుక్కల నివారణకు చర్యలు చేపడతాం



కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలో పలు కాలనీల్లో కుక్కలు మందలు మందలుగా తిరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వాటి నివారణ కోసం చర్యలు చేపడుతాం.

- నరేష్‌బాబు, మునిసిపల్ కమిషనర్

● పిల్లలను బయటకు పంపాలంటే భయమే



కుక్కల బెడదతో పిల్లలను బయటకు పంపాలంటే భయం కలుగుతుంది. ప్రభుత్వ యంత్రాంగం కుక్కలను నివారించాలి. చిన్న పిల్లలు బయటకు వెళ్తే కుక్కలు ఎక్కడ అంటే అక్కడ పీకుతున్నాయి.

- రవీందర్‌రెడ్డి

కుక్కల బెడదను నివారించాలి

కల్వకుర్తిటౌన్, జూలై 20 : కుక్కల బెడదను నివారించాలని మునిసిపల్ పరిధిలోని పఠాన్‌వాడి కాలనీవాసులు కోరుతున్నారు. శనివారం వీధికుక్కలు మేకపిల్లను కరవడంతో చనిపోయిందని కాలనీవాసులు తెలిపారు. కాలనీలో పాఠశాలలకు వెళ్లే బాలబాలికల వెంబడి పడుతున్నాయని, ద్విచక్రవాహనాల వెంబడించడంతో వారు కిందపడి గాయాల బారిన పడుతున్నారని వారు వాపోతున్నారు. పలు కాలనీల్లో ఇలాంటి పరిస్థితే ఉందని మునిసిపల్ అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నీట మునిగిన మొక్కజొన్న మొలకలు

- వేసిన పంట నీటిపాలంటూ బోరుమంటున్న రైతులు

-ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

కొల్లాపూర్, జూలై 20 : కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో గడిచిన పది రోజుల నుంచి వరుసగా కురుస్తున్న ముసురు వర్షాలతో నియోజకవర్గ రైతులు నష్టాలపాలవుతున్నారు. గడిచిన 20రోజుల క్రితం వర్షాలు పడ్డాయని సంబరపడి వ్యవసాయ పనుల్లో నిమగ్నమై రైతులు నాటిన మొక్కజొన్న పంటల మొలకలు వచ్చిన వెంటనే వరుసగా కురుస్తున్న ముసురుకు పొలాల్లోనే నీరు నిల్వ చేరి మొలకలన్నీ నీట మునిగి పొలాలన్నీ జాలువారాయి.

కొల్లాపూర్ మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి పెంట్లవెల్లి మండల శివారులో పదెకరాల భూమిని కౌలుకు తీసుకుని పెట్టుబడి పెట్టాడు. తన పదెకరాల పొలంలో గడిచిన 20రోజుల క్రితం మొక్కజొన్న పంట వేశారు. వరుసగా కురుస్తున్న ముసురు వర్షాలకు పొలంలో దాదాపు ఐదెకరాల పొలం వరకు నీరు నిల్వ చేరి మొక్కజొన్న పంట మొలకలన్నీ నీట మునిగాయి. దీంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కష్టపడి నాటిన మొక్కజొన్న పంట చేతికందకుం డానే మొలక దశలోనే నష్టపోయామని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.



పెంట్లవెల్లి శివారులో ముసురు వర్షాలతో నీట మునిగిన మొక్కజొన్న పంట మొక్కలు

● ప్రభుత్వం ఆదుకోవాలి

తాను పదెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట వేశాను. వరుసగా కురుస్తున్న ముసురు వర్షాలతో పొలంలో నీరు నిల్వ చేరి పంటంతా పాడైంది. దాదాపు ఐదెకరాల పొలంలో నీరు నిల్వ చేరడంతో నష్టపోయాను. పెట్టిన పెట్టుబడికూడా వృథా అయింది. ప్రభుత్వం తమలాంటి రైతులను గుర్తించి ఆదుకోవాలి.

- మద్దిలేటి, రైతు, రామాపురం

రహదారులు బురదమయం



కల్వకుర్తి ఎన్‌జీవో కాలనీలో బురదగా మారిన రోడ్డు



కల్వకుర్తి ఎంపీడీవో కార్యాలయ సమీపకాలనీలో గుంతలు

కల్వకుర్తిటౌన్, జూలై 20 : ముసురు వర్షాలతో మునిసిపల్ పరిధిలో పలు కాలనీల్లో అంతర్గత రహదారులు బురదమయంగా మారి పాదాచారులకు, వాహదారులకు ఇబ్బందిగా మారిందని పలువురు వాపోతున్నారు. మునిసిపల్ పరిధిలో ఎన్‌జీవో కాలనీ, శాంతినగర్‌కాలనీ, విద్యానగర్ కాలనీలోని అంతర్గతంగా పూర్తిస్థాయిలో సీసీ రహదారుల నిర్మాణంలేక పోవడంతో వర్షాలుకురిసిన సమయంలో ఆయాకాలనీల్లో ఉండేవారికి రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారుతున్నాయని వారు అంటున్నారు. సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి పరిష్కరించాలని మునిసిపల్ అధికారులను సిబ్బందిని ఆయా కాలనీలప్రజలు కోరుతున్నారు.

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా..

● అమ్రాబాద్: రెండు రోజులు నుంచి కురుస్తున్న ముసురు వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఒక మాదిరిగా ఉన్నా శనివారం సాయంత్రానికి అమ్రాబాద్, పదర మండలాల్లో ఈ ప్రభావం ఎక్కువై ఎడతెరిపి లేకుండా కురిసింది. దీనితో రైతులు, ప్రజలు రెండు రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ తుఫాన్ ప్రభావం మరో రెండు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో పాత మట్టి మిద్దెలు కులిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● ఊర్కొండ: మండలంలో కురుస్తున్న ముసురు వర్షానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చెన్నకిష్టన్న, ఎస్సై వీరబాబులు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వారు పర్యటించి ప్రజలకు అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు వర్షాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లరాదని, మట్టిమిద్దె ఇళ్లలో నివసించేవారు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాల్‌లో ఉండాలని కోరారు. అదేవిధంగా వర్షాలు తగ్గే వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రజలు ఆరోగ్యరీత్యా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది సూచనలు పాటించాలని కోరారు. వారి వెంట రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

● కోడేరు: మండలంలోని ప్రజలు వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు ప్రజలు మట్టి మిద్దెలలో ఉండరాదన్నారు. దగ్గరలో ఉన్న ప్రభుత్వ భవనాల్లో ఉండాలని, ఇనుప విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు.

● చారకొండ: ముసురు వర్షానికి మండల కేంద్రంలో కోదాడ-జడ్చర్ల ప్రధాన రహదారి చిత్తడిగా మారింది. మండల కేంద్రం నుంచి మండలంలోని మర్రిపల్లి వరకు 2 కిలోమీటర్లు ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా ఉండడంతో చిన్నపాటి ముసురు వర్షానికి గుంతల్లో నీరు చేరింది. శనివారం జరిగిన సంతకు వచ్చిన ప్రయాణికులు, వాహనదారులు, క్రయ, విక్రయాలు జరిపే వారు ఇబ్బందులకు గురయ్యారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

కందనూలు: జిల్లాలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎ మ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి శనివారం ఒక ప్రకట నలో సూచించారు. నిరంతరం వర్షాలు కురుస్తున్న సం దర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా శిథిలావస్థలో ఉండి కూలిపోయే పరిస్థితిలో ఉన్న ఇళ్లలో ఉండేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని ఆయన సూచించారు. చెరువులు, కుంట లు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నీటి ప్రవాహం ఉన్నచోట రాకపోకలపై దృష్టి సారించాలని, ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ఎవరికీ ఎలాంటి విషయాలు చెప్పకుండా జాగ్రత్తలు వహించాల్సిందిగా తెలిపారు. సైబర్ నేరాలతో మోసపోకుండా ఉండేందుకు ఫోన్లకు స్ట్రాంగ్, పొడవైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని సోషల్ మీడియా ఖాతాలో డేటా గోప్యత సెట్టింగ్ ఉపయోగించాలని వాటిని ప్రైవేట్‌గా ఉంచాలన్నారు. ఆన్‌లైన్ ఖాతాల కోసం రెండు దశల ప్రమాణీకరణ 2ఎఫ్ఏ ఉపయోగించాలని, మొబైల్ అప్లికేషన్లను ఇన్‌స్టాల్ చేస్తున్నప్పుడు కాల్స్, కాంటాక్ట్‌లు, మేసేజ్‌లు మీడియా మరి లొకేషన్‌లను యాక్సిస్ అనుమతించే ముందు ఆలోచించాలని, వెబ్‌సైట్లను బ్రౌజ్ చేసే ముందు యూఆర్‌ఎల్‌లో హెచ్‌టీటీపీఎస్ కోసం తనిఖీ చేయాలన్నారు. అదేవిధంగా అపరిచిత వ్యక్తులు పంపిన లింకులు లేదా వెబ్‌సైట్లలో పాప్‌యాప్స్‌ను క్లిక్ చేయవద్దని, అపరిచితులకు సీవీవీతో సహా వ్యక్తిగత సమాచారం ఓటీపీ క్రెడిట్, డెబిట్ కార్డ్ సమాచారాన్ని చెప్పవద్దన్నారు. తప్పుడు సూచనలు చేస్తూ మెయిల్స్‌లో పోర్న్ సైట్లు వీక్షించమని మీకు వచ్చే సందేశాలను నమ్మవద్దని, మీ స్నేహితులు, బంధువులు లేదా పై అధికారుల యొక్క వాట్సాప్ డీపీలతో డబ్బును అడిగినట్లయితే నమ్మవద్దని, నమ్మదగిన మూలం నుంచి వచ్చిన మెయిల్స్ లేదా అటాచ్‌మెంట్స్‌ను ఓపెన్ చేయవద్దన్నారు. మీ కంప్యూటర్ లేదా మొబైల్‌లో అసురక్షిత అన్‌వెరిఫైడ్ ప్రోగ్రామ్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దన్నారు. ఎనీడెస్క్ లేదా టీం యువర్ వంటి రిమోట్ అప్లికేషన్లను డౌన్‌లోడ్ చేయకండని, ఓపెన్ పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించవద్దని, పబ్లిక్ ప్రదేశాల్లో యూఎస్‌బీ పోర్టులతో చార్జింగ్ పెట్టకండని ఓపెన్ పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించవద్దని ఎస్పీ తెలిపారు. పబ్లిక్ ప్రదేశాలలో యూఎస్‌బీ పోర్టులతో చార్జింగ్ పెట్టవద్దని, పార్ట్‌టైం జాబులు లేదా వర్క్ ఫ్రమ్ హోం అని వచ్చే కాల్స్ లేదా సందేశాలను నమ్మవద్దని, రెస్పాండ్ కావద్దని, స్టాక్‌లు ఐపీఓస్‌లో పెట్టుబడి పెట్టేముందు నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫారంల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి సైబర్‌నేరాల బారిన పడకుండా ఉంటారని ఎస్పీ ప్రజలకు దిశా నిర్దేశం చేశారు.

'విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలి'

తెలకపల్లి, జూలై 20 : సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలకపల్లి మండల గౌడ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ విజ్ఞప్తి చేశారు. శనివారం తెలకపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న ఉదయం 10గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, జూపల్లి కృష్ణారావు తదితర నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. కావున మండల వ్యాప్తంగా ఉన్న గౌడ సంఘం సభ్యులు విగ్రహావిష్కరణలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడు వేముల ఆంజనయులుగౌడ్, సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బాలస్వామిగౌడ్, తిరుపతయ్యగౌడ్, విజయ్‌గౌడ్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

చారకొండ, జూలై 20: పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంతో పాటు రికార్డులను శనివారం ఎంపీడీవో పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి గణేష్, హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాలో సవరణలు చేయించుకోవాలి

పెద్దకొత్తపల్లి, జూలై 20 : రైతు బీమాలో ఎలాంటి సవరణలు ఉన్నా చేయించుకోవాలని పెద్దకొత్తపల్లి ఏఈవో ఎండి.ముజీబ్ అన్నారు. పెద్దకొత్తపల్లి క్లస్టర్ బాచారం, జొన్నలబొగుడ, పెద్దకొత్తపల్లి క్లస్టర్‌లోని గ్రామాల రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కొత్తగా పాస్‌పుస్తకాల పట్టాదారులు, సవరణలు ఉన్న రైతులు వ్యవసాయ విస్తరణాధికారిని కలిసి పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ దరఖాస్తు ఫారంతో జతపర్చి అందజేయాలని ఆయన కోరారు.

విద్యార్థులు అవకాశాలను సద్వినియోగపర్చుకోవాలి

కొల్లాపూర్, జూలై 20 : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలని జీవితంలో లక్ష్యాలను అధిరోహించాలని ఎల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజావర్ధన్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాఠశాల ఉపాధ్యాయులు అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌పద్మ, ఉపాధ్యాయులు శ్రీకాంత్, మునీశ్వర్, శీనయ్యశ్రీధర్, కృష్ణకుమారి, సీఆర్పీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములు కావాలి



మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు, సేఫ్టీ మెజర్స్ పంపిణీ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్

కల్వకుర్తి, జూలై 20 : పారిశుధ్య నిర్వహణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కోరారు. మునిసిపల్‌లో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి రెయిన్‌కోట్లు, సేఫ్టీ మెజర్స్‌ను స్థానిక మునిసిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్‌షాహేద్, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌లతో కలిసి చైర్మన్ ఎడ్మ సత్యం శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్‌లో పని చేస్తున్న కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణకు ప్రజలు సహకరించి చెత్తనందించాలని సూచించారు. తడి పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తీర్నాంపల్లిలో ఇంటింటి సర్వే

పెద్దకొత్తపల్లి, జూలై 20 : మండల పరిధిలోని తీర్నాంపల్లి గ్రామంలో పెద్దకొత్తపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. తీర్నాంపల్లి గ్రామంలో జ్వరాలు ఎక్కువగా ఉండటంతో వైద్య క్యాంపులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. ఏఎన్‌ఎంలు నాగమణి, భాగ్యమ్మ, జ్యోతి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఉప్పునుంతల, జూలై 20: రాష్ట్రవ్యాప్తంగా రైతులకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ అయిన సందర్భంగా రైతులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై లెనిన్ అన్నారు. సైబర్ కేటుగాళ్లు రైతుల అకౌంట్లను హ్యాక్‌చేసే ప్రమాదం ఉందని ప్రతీ రైతు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా సైబర్ బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలన్నారు.

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా ఎం.ఫిరంగి

కందనూలు, జూలై 20 : నాగర్‌కర్నూల్ జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా ఎం.ఫిరంగి బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎం.ఫిరంగి సాధారణ బదిలీలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీపై వచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో డీటీడబ్ల్యూవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడికి ఎమ్మెల్యే పరామర్శ

బిజినేపల్లి, జూలై 20 : అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆంజనేయులును ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి పరామర్శించారు. మండలంలోని సల్కేరోపేట మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆంజనేయులు మూత్రపిండాల సమస్యతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుండగా శనివారం ఎమ్మెల్యే ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, సమయానికి ఆహారం నీళ్ళు తీసుకోకపోవడం వల్ల కిడ్నీ సమస్యలు వస్తాయని అన్నారు. ప్రతీ ఒక్కరు పని ఒత్తిడితో సరైన మోతాదులో నీరు తీసుకోరని, అలాగే ఒకే దగ్గర కూర్చోవడం ద్వారా కూడా కిడ్నీల్లో రాళ్ళు వచ్చే అవకాశం ఉన్నందున ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. ఆసుపత్రి యాజమాన్యంతో మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు మలిశెట్టి వెంకటస్వామి, పులిదండ నగేష్, కృష్ణారెడ్డి, కత్తె ఈశ్వర్ ఉన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా ముక్తార్ నియామకం

బిజినేపల్లి, జూలై 20 : నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా బిజినేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముక్తార్ నియామకం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేసి ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో 40 ఏళ్లకు పైగా కార్యకర్తగా, మండల పార్టీ నాయకుడిగా పార్టీ పటిష్టతకు అహర్నిషలు పాటుపడినట్లు కొనియాడారు. పార్టీలో నిబద్ధతతో పనిచేసే వారికి గుర్తింపు దక్కుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఆయనను సన్మానించిన వారిలో మలిశెట్టి వెంకటస్వామి, గోవిందు రామకృష్ణ, వంగ రామన్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం



లింగసానిపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

బిజినేపల్లి, జూలై 20 : అసెంబ్లీ ఎన్నికల ముందు ఒకే విడతలో రెండు లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మాటకు కట్టుబడి రుణమాఫీ ఒకే విడతలో చేసిన సీఎం చిత్రపటానికి మండలంలోని లింగసానిపల్లి గ్రామ రైతులు శనివారం క్షీరాభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుతల వారీగా రుణమాఫీ చేసిన మిత్తికి సరిపోలేదని పలువురు రైతులు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి ప్రజా పాలన సాగిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ సందడి రవీందర్ రెడ్డి అన్నారు. క్షీరాభిషేకం చేసిన వారిలో రైతులు మేకల వెంకట్ రెడ్డి, డీలర్ వెంకట్ రెడ్డి, రామయ్య, గంగోజీ, పురం చెన్నయ్య, గంగనమోని మల్లేష్, జంగయ్య గౌడ్, నాగరాజుగౌడ్, రమేష్‌గౌడ్, విష్ణువర్ధన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

అచ్చంపేటటౌన్, జూలై 20: ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ పాఠశాలలో చేరేలా చూడాలని ఏసీడీపీవో కమల అన్నారు. శనివారం పట్టణంలోని సాయినగర్‌లోని 12,16వ అంగన్‌వాడీ సెంటర్లలో అమ్మ మాట బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో కంటే ఉత్తమమైన బోధన అంగన్‌వాడీ కేంద్రాలలో ఉంటుందన్నారు. చిన్నారులను తల్లులు తప్పకుండా అంగన్‌వాడీలో చేర్పించి బడికి బాటలు వేయాలన్నారు. కొత్త సిలబస్ ప్రకారం మెటీరియల్ ఇవ్వడంతో పాటు పోషకాహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లలిత, సంతోషి హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల పరిధిలోని జప్తిసదగోడు గ్రామంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీపాషా అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని వారు సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు సావిత్ర, జంగమ్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

తిమ్మాజిపేట, జూలై 20 : ప్రతీ విద్యార్థి ఏకాగ్రతతో చదవాలని ఉన్నత పదవులు పొందాలని జన్మనిచ్చిన తల్లిదండ్రులను జ్ఞానాన్ని ప్రసాదించిన గురువులను మరువద్దని పాఠశాలకు మంచి పేరు తేవాలని మండల విద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని బోయగేరి పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆశ్రయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్స్, చెప్పులు పంపిణీ చేశారు. ఆశ్రయ ఫౌండేషన్ ప్రతినిధులు గోపినాథ్, సువర్ణ, లత, ఉపాధ్యాయులు జైపాల్‌రెడ్డి, నందకిశోర్, ఎల్లయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



బోయలపల్లిలో తాగునీటి బోరు మోటారు ఏర్పాటు చేయిస్తున్న మునిసిపల్ సిబ్బంది

కొల్లాపూర్, జూలై 20 : కొల్లాపూర్ మునిసిపల్ పరిధిలోని 20 వార్డుల్లో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య పేర్కొన్నారు. శనివారం కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డు తాళ్లనర్సింగపురం గ్రామంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించేలా ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామంలో నూతన బోరు మోటారును ఏర్పాటు చేయించినట్లు ఆమె పేర్కొన్నారు. నూతన బోరుమోటారు ఏర్పాటుతో తాళ్లనర్సింగపురం గ్రామంలో నీటి సమస్యలు తొలగిపోతాయని వార్డు కౌన్సిలర్ చిట్టెమ్మ పేర్కొన్నారు. కొల్లాపూర్ మునిసిపల్ పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడు తాను అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. సమస్యలను మునిసిపల్ ప్రజలు నేరుగా తమ దృష్టికి తేవాలని, వెంటనే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.